క్లుప్తంగా

టేక్మాల్‌లో నేడు ఉచిత కంటి పరీక్షలు

టేక్మాల్(మెదక్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టేక్మాల్ గాంధీభవన్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి టి.శంకర్‌రావు దేష్‌పాండే గురువారం తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని మెడివిజన్ ఐకేర్ సెంటర్ వైద్యులు వస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చెట్టుకొమ్మల తొలగింపు



రోడ్డు పై చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డును కమ్మేసిన చెట్టుకొమ్మతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్న విషయం గురించి 'సాక్షి' దినపత్రికలో బుధవారం చెట్టుకొమ్మతో ప్రమాదాలు కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత హైవే అధికారులు స్పందించారు. గురువారం చండీ గ్రామ శివారు తూప్రాన్ - నర్సాపూర్ హైవే రోడ్డుపై ఎండిపోయి ఉన్న చెట్టు కొమ్మలను జేసీబీతో తొలగించారు. ప్రమాదాల నివారణకు కృషి చేసిన సాక్షి దినపత్రికకు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ



తాళ్లపల్లి తండాలో ఓటర్ స్లిప్పులు అందిస్తున్న బీఎల్‌ఓ

శివ్వంపేట(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశారు. మండలంలోని 52 బూత్‌ల్లో బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి స్లిప్పులు అందజేస్తున్నారు. మే 13న జరిగే పోలింగ్ రోజున ఓటర్లకు సంబంధించి 13 రకాల ఏదైన గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ మే 6 వరకు పూర్తి చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి



మాట్లాడుతున్న విజయపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్, సూర్యప్రకాష్, అశోక్, సుభాష్, కృష్ణ, బాబు రాథోడ్, సురేందర్‌రెడ్డి, శ్రీహరి తదితరులు ఉన్నారు.

దాసు మృతికి అధికారులదే బాధ్యత

పంచాయతీ కార్మికుల సంఘం నేత ఆసిఫ్



అంతిమయాత్రలో పారిశుద్ధ్య కార్మికులు

కొల్చారం(నర్సాపూర్): మురుగు గుంతలోపడిన పారిశుద్ధ్య కార్మికుడు మాదిగ దాసు మృతికి మండల అధికారులే బాధ్యత వహించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన అంతిమ యాత్రలో సీఐటీయూ అనుబంధ సంఘాలకు చెందిన నాయకులతో పాటు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లే దాసు మృతి చెందాడని ఆరోపించారు. ప్రభుత్వం రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు మల్లేశం, సత్యం లక్ష్మణ్, రవి, కిష్టయ్య, శేఖర్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లకు భలే డిమాండ్

- ధాన్యం ఆరబోతకు అవసరమంటున్న రైతులు
- సబ్సిడీలో అందుబాటులో లేవన్న వ్యవసాయాధికారులు



సోమక్కపేటలో టార్పాలిన్లు కుడుతున్న నిర్వాహకుడు సతీష్

చిలప్‌చెడ్(నర్సాపూర్): టార్పాలిన్లకు మంచి డిమాండ్ ఉంది. రైతులకు ధాన్యం ఆరబెట్టడానికి, వర్షం వచ్చిన ధాన్యాన్ని కాపాడాటానికి ముఖ్యంగా రైతులు వెతికేది టార్పాలిన్లే. మండలంలో ఈ యాసంగి సీజన్‌లో సుమారుగా 12 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రం ఆవరణలో ధాన్యం ఆరబోసుకోవడానికి టార్పాలిన్లు చాలా అవసరం. దీంతో రైతులు ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ. 12 నుంచి రూ. 15 వరకు చెల్లిస్తూ అద్దెకు తీసుకుంటున్నారు.

ఉపాధి పొందుతున్న పక్క రాష్ట్రం వాసులు

మండలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన సుమారు వంద కుటుంబాలు మెదక్ జిల్లా వ్యాప్తంగా టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రూ. 12 నుంచి రూ. 15 వరకు అద్దెకు ఇస్తున్నారు. ఆయా మండలాల్లో పండిన వరి ధాన్యం ఆధారంగా తమ టార్పాలిన్లకు డిమాండ్ ఉంటుందని, ప్రస్తుతానికి సుమారుగా 50 నుంచి 100 టార్పాలిన్లు అద్దెకిస్తున్నామన్నారు. రైతులు బేరాలడిన రోజుకు రూ. వెయ్యి వరకు సంపాదిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్యాలయంలో నాలుగేళ్లగా సబ్సిడీ టార్పాలిన్లు అందుబాటులో లేవని వ్యవసాయ అధికారులు తెలిపారు. ధాన్యాన్ని ఎక్కువగా ఆరబెట్టడం మూలంగా టార్పాలిన్ల కిరాయి మరింతగా పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ ఇవ్వాలి



మండలంలో వరి కోతలు ప్రారంభం కావడంతో టార్పాలిన్లకు డిమాండ్ పెరిగింది. గత సీజనల్ రోజుకు ఒక్క టార్పాలిన్ అద్దె రూ. 10 ఉండేది. ప్రస్తుతం వాటి అద్దె ధరలు కూడా పెరిగాయి. వ్యవసాయ కార్యాలయంలో సబ్సీడీపై టార్పాలిన్లు ఇవ్వాలి.

– బోయిని సుధాకర్, రైతు, చిట్కుల్

ఏటా ఇక్కడే..



ఏటా మండలంలోని చండూర్ లోనే టార్పాలిన్లు అద్దెకిస్తాం. గత సీజన్లో ఇదే ప్రాంతంలో టార్పాలిన్లు అద్దెకిస్తూ ఉపాధి పొందాం. ఈ యాసంగి సీజన్‌లో సైతం రైతులు ధాన్యం ఎక్కువగా పండించడంతో టార్పాలిన్లకు డిమాండ్ పెరిగింది. ఇక్కడ సీజన్ ముగియగానే వేరే ప్రాంతాల్లో టార్పాలిన్లు అద్దెకు ఇచ్చేందుకు వెళ్తాం. మా కుటుంబాలు టార్పాలిన్లు అద్దెకిస్తూనే జీవనం సాగిస్తాయి.

– సాంబశివరావు, టార్పాలిన్ల నిర్వాహకుడు

కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు పెద్దశంకరంపేట మండలాన్ని సంగారెడ్డిలో కలపాలన్నారు. కాళేశ్వరం 19ఏ ప్యాకేజీ పనులు కొనసాగిస్తామని, బసవేశ్వర ప్రాజెక్టును పూర్తిచేస్తామని, వలసల నివారణకు చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలన్నారు. రుణమాఫీ, దివ్యాంగుల, వృద్ధుల పెన్షన్‌లు పెంచాలని తెలిపారు. మహిళలకు రూ.2500లు ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఈ ప్రాంతంలోని నల్లవాగు కింద రెండు పంటలకు సాగునీటిని అందించాలని, నారాయణఖేడ్ డెవలప్‌మెంట్‌కు నిధులు ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, రైతుబంధు మాజీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, నాయకులు శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

29న శివ్వంపేట సర్వసభ్య సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 29న శివ్వంపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్ తెలిపారు. ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ సర్వసభ్య సమావేశంలో భాగంగా ఈ నెల 29 ఉదయం 11:30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ సమస్యలతో పాటు ముఖ్యంగా వేసవికాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందితో చర్చించనున్నట్లు చెప్పారు.

చేగుంటలో నేడు మండల సమావేశం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్(61)

నర్సాపూర్, శివ్వంపేట: మండల పరిధిలోని బిజ్లిపూర్ గ్రామంలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోండి వెంకటేశ్(61) అనే వ్యక్తికి మతి స్థిమితం సరిగా లేదు. 24న బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేశ్ తిరిగి రాలేదు. గ్రామంలో తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. వెంకటేశ్ కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రారంభమైన సమ్మర్ క్రికెట్ కోచింగ్



క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ గురువారం ఇందిరా గాంధీ స్టేడియంలో హట్ట హాసంగా ప్రారంభమైంది. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు యువత భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా క్యాంప్ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ సమ్మర్ క్యాంప్‌ను ప్రతీ ఒక్కరూ ఉపయోగించుకొని భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు శరీరం దృఢంగా అవుతుందని తెలిపారు. క్రీడాకారులకు ఆటతో పాటు క్రమ శిక్షణ ముఖ్యమని, క్రమ శిక్షణ ద్వారానే ఏదైనా సాధ్యమని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ ప్రతినిధి మహేందర్ రెడ్డి, స్పోర్ట్స్ ఫౌండేషన్ శాశ్వత అధ్యక్షులు శివ శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి జుబెర్, పీఈటీలు, మాధవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, వేణు కుమార్, శ్రీనివాస్, ఉమర్, అర్జున్, శివ నాగ్ తదితరులు పాల్గొన్నారు.

జూటా మాటల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



కార్యకర్తలతో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): జూటా మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. ప్రజలకిచ్చిన హామీలకు మంగళం పలికిండన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని, మన పైసలు దోచుకొని మననే మోసం చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్ రెడ్డిని చిత్తుగా ఓడించాలని కోరారు. దేశం, ధర్మం కోసం పనిచేస్తున్న బీజేపీ గుర్తు కమలంకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, చిన్నశంకరంపేట, నార్సింగి మండల అధ్యక్షుడు రాజు, బాల్‌రెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, నందారెడ్డి, మాజీ సర్పంచ్ మూర్తి పెద్దలు, మండల నాయకులు దశరథం, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేద్దాం

మెదక్‌జోన్: పార్లమెంట్ ఎన్నికల్లో సమిష్టిగా పని చేసి మెదక్ పార్లమెంట్ సీటును ప్రధాని మోదీకి కానుకగా ఇద్దామని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం సుభిక్షంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరు బీజేపీకి ఓటేయాలన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. మండలంలోని పాతూరు గ్రామానికి చెందిన ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, నిజాంపేట జెడ్పీటీసీ విజయ్ కుమార్, జిల్లా నాయకులు నందా రెడ్డి, విజయ్, సుభాష్ చంద్రబోస్, దేవిమధు, కల్కి, నాగరాజు, లోకేష్, జనార్దన్, రంజిత్ రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం, జీడిపల్లి గ్రామల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు పురం రవి, ఉదయ్‌రంజన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుంటరాజు, కృష్ణ, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామానికి చెందిన పలువురు యువకులు, మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. వీరి వెంట రాష్ట్ర నాయకులు ఎలక్షన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనర్సింలుగౌడ్, మండల నాయకులు రమేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌పంతులు తదితరులున్నారు.

◆ **ఘనంగా కాలేజీ వార్షికోత్సవం**

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ 27వ వార్షికోత్సవాన్ని గురువారం కాలేజీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మీవీ ఫౌండర్, ఆవిష్కరణ్ డైరెక్టర్ మిధుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె సన్మానించారు.

◆ **మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్**

చిన్నశంకరంపేట(మెదక్): మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన కందరి శ్రీనివాస్ నియామకం అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. అలాగే మండల అధ్యక్షుడుగా చింతల మల్లేశానికి కూడా నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



వెల్దుర్తి(తూప్రాన్): ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బండపోసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని గ్రామస్తులు నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి దయతో ప్రజలంతా పాడి, పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు.

ఈద్‌మిలాప్‌లో ఎమ్మెల్యే

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు షేక్ హుస్సేన్ గురువారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ తప్పనిసరిగా మాట్లాడాలి



మాట్లాడుతున్న ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్



సమావేశానికి హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్

మెదక్‌జోన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతీ విద్యార్థి తెలుగు మాట్లాడిన విధంగానే ఇంగ్లిష్ మాట్లాడాలని విల్‌టుకెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పరిశోధన విద్యా సంస్థ వారి సహకారంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ కోచింగ్ ఇచ్చేందుకు తనను ఎంపిక చేశారని చెప్పారు. అందులో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ఇంగ్లిష్ బోధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుందన్నారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. కాగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజుల పాటు ఆన్‌లైన్‌లో ఇంగ్లిష్ బోధన తరగతులు జరుగుతాయన్నారు. ఇందులో మొదటి రోజు ఫిజికల్ క్లాస్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో 26 జిల్లాల్లో ఉపాధ్యాయులకు ఈ తరగతులను పూర్తి చేశామని, త్వరలో మిగతా జిల్లాలకు సైతం పూర్తి చేస్తామని తెలిపారు.

నన్ను ఆశీర్వదించండి.. రుణం తీర్చుకుంటా

మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నీలం మధు

వెల్దుర్తి(తూప్రాన్): పార్లమెంట్ ఎన్నికలలో తనను ఆశీర్వదించండి, మీ రుణం తీర్చుకుంటానని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ఓటర్లను అభ్యర్థించారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం మొదటిసారిగా ఉమ్మడి వెల్దుర్తి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ జిల్లా ప్రాంతానికి పరిశ్రమలు, కంపెనీలను తీసుకొచ్చి చాలా వరకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. బీసీ బిడ్డగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం రావడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్ రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, హన్మేష, సుధాకర్‌గౌడ్, మల్లేశంచారి పాల్గొన్నారు.

పోడు భూములు సమస్యలు తీరుస్తా

కౌడిపల్లి(నర్సాపూర్): సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు తెలిపారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నియోజకవర్గం ఇన్‌చార్జి రాజిరెడ్డితో కలిసి కౌడిపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివపల్లి మాజీ సర్పంచ్‌లు నర్సింగారావు, వీరయ్య, సొసైటీ డైరెక్టర్ రాయగిరి తదితరులు పార్టీలో చేరారు. ఈరోడ్‌షోలో రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, పాషా, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్చారం మండలంలో..

కొల్చారం(నర్సాపూర్): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో రోడ్ షో నిర్వహించారు. మండలంలోని దుంపలకుంట చౌరస్తా వద్ద పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మహిళా అధ్యక్షురాలు అనిత రోడ్ షోకు స్వాగతం పలికారు. రోడ్ షో రంగంపేట, సంగాయిపేట, చిన్నఘనాపూర్, పోతంశెట్టిపల్లి చౌరస్తా మీదుగా మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మండల నాయకులు గోవర్దన్, మహేశ్వర్ రెడ్డి, శేఖర్, కృష్ణ, చందు, ప్రవీణ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సామగ్రి మాయం చేస్తుండ్రు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

టేక్మాల్ మండల సమావేశంలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

టేక్మాల్(మెదక్): అంగన్‌వాడీల నిర్వహణ అధ్వానంగా మారిందని, సామగ్రిని పూర్తిగా అమ్ముకుంటున్నారని మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, ఎంపీటీసీ వాణి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లపై మండిపడ్డారు. గురువారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఎంపీపీ స్వప్న అధ్యక్షతన, ఎంపీడీఓ రియాజొద్దీన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసూఫ్, వైస్ ఎంపీపీ మంజుల మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూస్ ఏఈని ఆదేశించారు. ఆస్పత్రిలో డాక్టర్ పవన్ సమయపాలన పాటించడం లేదని మండిపడ్డారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీటీసీ వాణి మాట్లాడుతూ.. ఉచిత బిల్లులు అందరికి వర్తించేలా చూడాలని తెలిపారు. చెరువు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఎంపీపీ ఇరిగేషన్ అధికారులపై మండిపడ్డారు. ఉపాధి హామీ పనిలో తీసిన మట్టిని చెరువుల్లోనే పోయకుండా రైతుల పొలాల్లోకి తరలించాలని తెలిపారు. సమావేశాలకు మండల స్థాయి అధికారులు రావాలని పూర్తి బాధ్యతగా పని చేయాలని ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, వైస్ ఎంపీపీ మంజుల, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్‌రామిరెడ్డి గెలుపు ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన చేగుంట నుంచి మెదక్ వరకు కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకట్ రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. నారాయణరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.